సాక్షి చిత్తూరు

సోమవారం । 8 । జూలై । 2024



ర్యాంపుల వైపే రైతుల చూపు

మామిడి రైతులకు గుజ్జు పరిశ్రమల నిర్వాహకుల రింగ్‌గా ఏర్పడడంతో ఆశించిన ధరలు లభించలేదు. - 8లో



ఎగసి పడుతున్న అలలు

అల్పపీడనం ప్రభావంతో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి సముద్రంలో అలలు ఎగసి పడుతున్నాయి. - 8లో



గంగమ్మ దీవెనల కోసం ..

బోయకొండ గంగమ్మ దర్శనం కోసం భారీగా భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం జనసంద్రమైంది. - 8లో

న్యూస్‌రీల్

ఇసుక పంపిణీ సమయం మార్పు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇసుక పంపిణీ సమయం మార్పు చేయడం జరిగిందని ఆర్డీఓ చిన్నయ్య వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు రూరల్ మండలంలోని పాలూరు, దిగువమాసాపల్లి ఇసుక డిపోలలో ఈ నెల 8వ తేదీ నుంచి ఇసుకను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆ రెండు డిపోల్లో ఉదయం 6 గంటలకు బదులు మధ్యాహ్నం 3 గంటలకు పంపిణీ సమయం మార్పు చేయడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆర్డీఓ కోరారు.

బుద్ధుడి బోధనలు వికాస మార్గాలు

కాణిపాకం: బుద్ధుని బోధనలు ఆరోగ్య సమాజానికి, సమానత్వానికి, విశ్వమానవ వికాసానికి మార్గాలని ప్రముఖ బుద్ధిస్ట్ బొర్రా గోవర్ధన్ ఉద్ఘాటించారు. చిత్తూరు నగరం పీవీకేఎన్ సమీపంలోని మ్యాంగో భవన్‌లో ఆదివారం 'ఈనాటి పరిస్థితుల్లో బౌద్ధం అవసరం' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రంగాలకు చెందిన ప్రజలు దురాశలతో కుటుంబం, సమాజం విచ్ఛిన్నం అవుతున్నాయని తెలిపారు. నాగరికత ధర్మాన్ని పాటిస్తే సమాజం ధర్మ మార్గం, సామ్యవాదం వైపు నడుస్తుందన్నారు. అనంతరం పలువురిని బుద్ధుడి ప్రతిమతో సత్కరించారు. కార్యక్రమంలో రచయితలు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, రామలక్ష్మి, శివమోహన్‌రెడ్డి, సహదేవనాయుడు, పార్థసారథి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల సందడి



ఆలయంలో కిటకిటలాడుతున్న భక్తులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో స్వామివారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి క్యూలో వేచి ఉన్నారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో క్యూలైన్లు అన్ని కూడా నిండుకున్నాయి. భక్తులకు దర్శనం కల్పించడంలో అధికారులు ఇబ్బంది లేకుండా చూశారు. రద్దీని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ భక్తులకు శీఘ్ర దర్శనమయ్యేలా చర్యలు చేపట్టారు.

నేడు గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



సహకార గోదామును తనిఖీ చేస్తున్న అధికారులు

నగరి : నగరి పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను నెల్లూరు డీడీఏ శివనారాయణ, విజిలెన్స్ ఎస్ఐ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. పట్టణ పరిధిలోని ఎరువుల దుకాణాలతో పాటు సహకార సంస్థకు చెందిన గోదాములోని విత్తనాలు, ఎరువులను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, నకిలీ మందులు విక్రయించరాదని దుకాణదారులకు సూచించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ అధికారి రాఘవేంద్రయాదవ్, పీఏసీఎస్ సీఈఓ తులసిపిళ్లై పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

ఉచిత ఇసుక ఉట్టిదే!

గత ప్రభుత్వంలో..

మాది కార్వేటినగరం మండల కేంద్రంలోని కత్తెరపల్లి. నా పేరు అరుణాచలం. ఏడాది క్రితం నా పెద్దకుమారుడు రమేష్‌కు ఒక ఇంటిని నిర్మించాం. అప్పటి ప్రభుత్వం టన్ను ఇసుక రూ.675కి ఇచ్చింది. ట్రాక్టర్‌కు 5 టన్నుల ఇసుక పడుతుంది. ఈ లెక్కన ప్రభుత్వానికి రూ.3,375 చెల్లించేవాళ్లం. మా మండలం దగ్గరలోనే ఇసుక స్టాక్ పాయింట్ ఉండేది. మండల కేంద్రం నుంచి స్టాక్‌పాయింట్‌కు 11 కిలోమీటర్ల దూరం ఉంది. ట్రాక్టర్ బాడుగ రూ.1000 ఇచ్చేవాళ్లం, మొత్తంగా ఒక ట్రాక్టర్ ఇసుక రూ.4375కి వచ్చేది. ఒక్కో నియోజకవర్గానికి రెండు ఇసుక స్టాక్ పాయింట్లు ఉండడంతో ప్రజలంతా ఇసుకను సులువుగా తీసుకెళ్లేవారు.

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో..

మా చిన్న కుమారుడు సురేష్‌కు ఇంకో ఇంటిని నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇసుకకు ఈ ప్రభుత్వం నిర్ణయించిన రేట్లు లెక్కలు వేసుకుంటే.. నగరి నియోజకవర్గంలో ఎక్కడా ఇసుక పాయింట్ పెట్టలేదు. మేము చిత్తూరు మండలంలోని ఇసుక డిపోలకు వెళ్లి ఇసుక తెచ్చుకోవాలని చెప్పారు. అక్కడ టన్ను రూ.155కి వస్తుంది. దీంతో టన్నుపై 89 శాతం తగ్గిందని సంతోషపడ్డాం. అయితే మా గ్రామం చిత్తూరు మండలం ఇసుక డిపో వద్దకు దాదాపు 79 కిలోమీటర్లు దూరం ఉంది. టన్ను రూ.155 చొప్పున ట్రాక్టర్‌కు 5 టన్నులు రూ.775 అవుతుంది. అయితే ట్రాక్టర్ బాడుగ రూ.7 వేలు అడుగుతున్నారు. ఇసుక పోయడానికి కూలీలకు రూ.500 అదనంగా ఇవ్వాలని చెబుతున్నారు. దీంతో ట్రాక్టర్ ఇసుక ఇంటికి చేరేసరికి రూ.7500 ఖర్చు అవుతుంది. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే ట్రాక్టర్ ఇసుకపై అదనంగా రూ.4800 ఖర్చు అవుతోంది.



- ఉచిత ఇసుక పంపిణీకి కూటమి ప్రభుత్వం మంగళం
- టన్ను ఇసుకకు ధర నిర్ణయించిన బాబు సర్కారు
- జిల్లా మొత్తానికి మూడే ఇసుక డిపోలు
- వైఎస్సార్ కాంగ్రెస్ సర్కారులో ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో ఇసుక డిపో
- విమర్శలు గుప్పిస్తున్న భవన నిర్మాణదారులు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు జిల్లాలో 7 నియోజకవర్గాలు, 31 మండలాలు ఉన్నాయి. అయితే రెండు నియోజకవర్గాల్లో రెండు మండలాల్లో మాత్రమే మూడు ఇసుక పాయింట్లు ఎంపిక చేశారు. చిత్తూరు నియోజకవర్గంలోని చిత్తూరు మండలంలోని పాలూరు, దిగువమాసాపల్లి, పలమనేరు నియోజకవర్గంలోని గంగవరం మండలం వద్ద ఉన్న బైరెడ్డిపల్లి క్రాస్ రోడ్డు డిపోలను ఇసుక పాయింట్లుగా గుర్తించారు. మిగిలిన కుప్పం, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, నగరి, పుంగనూరు నియోజకవర్గాల్లో ఇసుక పాయింట్లకు అవకాశం కల్పించలేదు. దీంతో మిగిలిన ఐదు నియోజకవర్గాలకు చెందిన ప్రజలు తమకు సమీపంలోని ఇసుక పాయింట్ల వద్దకు వెళ్లాలన్నా కనీసం 50 నుంచి 100 కి.మీ పైగా దూరం వెళ్లాల్సిన పరిస్థితి. ఈ లెక్కన టన్ను ఇసుక కొనుగోలుకు ఎంత చెల్లిస్తారో.. అంతకు మించి రవాణా ఖర్చు భరించాల్సిందేనని నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉచితంగా ఇసుక ఇస్తామని.. ఇప్పుడు ఇలా తిప్పలు పెట్టడం ఎంతవరకు న్యాయమని భవన నిర్మాణదారులు ప్రశ్నిస్తున్నారు.

పేదలపై కపట ప్రేమ..

ఒక ట్రాక్టర్‌కు 5 టన్నుల ఇసుక పడుతుంది. 20 టన్నులు అంటే రోజుకు నాలుగు ట్రాక్టర్ల ఇసుకకు మాత్రమే అనుమతి ఉంటుంది. నూతన ఇసుక విధానాన్ని చూస్తే..రోజూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే రెండు డిపోల్లో అనుమతి ఉంది. ఉదాహరణకు నగరి నియోజకవర్గం నుంచి చిత్తూరు మండలంలోని ఇసుక పాయింట్ వద్దకు టన్ను ఇసుక రూ.155 చొప్పున ఒక ట్రాక్టర్‌కు 5 టన్నులు భర్తీ చేయడానికి రూ.775 ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ట్రాక్టర్ బాడుగ రూ.4 వేల నుంచి రూ.4,500 చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఒక ట్రాక్టర్ ఇసుక ఇంటికి చేరడానికి రూ.5 వేల నుంచి రూ.5,500 చెల్లించాల్సి ఉంటుంది. ఇక సామాన్యులకు ఇసుక ఏమిటనేది ప్రశ్న ఉత్పన్నం కాక మానదు.

రవాణాపై ఆందోళన..

గత ప్రభుత్వ పాలనలో జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో ఇసుక పాయింట్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రవాణా సమస్యలు ఉండేవి కావు. దాదాపు అన్నిచోట్లా స్వర్ణముఖి నది ఆధారంగానే ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మూడు పాయింట్లు ఎంపిక చేయడంతో రవాణా చార్జీలపై అంతా ఆందోళన చెందుతున్నారు. నగరి నియోజకవర్గంలో ఇసుక పాయింట్ లేకపోవడంతో వారంతా చిత్తూరు ఇసుక డిపోకు వెళ్లడానికి 65–79 కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి ఉంది. లేదా పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లి క్రాస్ రోడ్డు ఇసుక డిపోకు వెళ్లాలంటే దాదాపు 90–110 కిలోమీటర్లు ఉంది. ఇక పుంగనూరు నియోజకవర్గ ప్రజలు బైరెడ్డిపల్లి క్రాస్ రోడ్డు పాయింట్‌కు వెళ్లాలంటే 55–65 కిలోమీటర్లకు పైగా వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ట్రాక్టర్ లోడు ఇసుకకు పది కిలోమీటర్లకు రవాణా చార్జీ కింద రూ.1000 చెల్లిస్తున్నారు. ఈ లెక్కన నగరి, పుంగనూరు, గంగాధరనెల్లూరులోని నిర్మాణదారులు ట్రాక్టర్ ఇసుక లోడు తెచ్చుకోవాలంటే దాదాపు రూ.9 వేలు రవాణా చార్జీకే చెల్లించాల్సి వస్తోంది.

అక్కడ ట్రాక్టర్ ఇసుక రూ.10 వేలు పైనే !

సాధారణంగా జిల్లాలో ఇసుక రవాణాకు ట్రాక్టర్ డ్రైవర్లు దూరాన్ని బట్టి బాడుగ తీసుకుంటారు. 10 కిలోమీటర్ల దూరం అయితే రూ.1,200 నుంచి రూ.1,400, అదే 20 కిలోమీటర్లకు రూ.2,100 నుంచి రూ.2,300 వరకు, 60 కిలోమీటర్లు అయితే రూ.6,000 నుంచి రూ.6,400 తీసుకుంటారు. జిల్లాలోని నగరి నియోజకవర్గ ప్రజలు చిత్తూరు మండలంలోని ఇసుక స్టాక్ పాయింట్లకు వెళ్లడానికి 90 నుంచి 105 పైచిలుకు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ లెక్కన వీరికి రవాణా భారం ఎక్కువ పడుతుంది. మొత్తంగా ఇసుక పాయింట్లు లేని నియోజకవర్గంలో ఒక ట్రాక్టర్ ఇసుక అవసరమైన వారు రూ.10 వేలకు పైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇసుక పాయింట్లు ఉన్న చోట ట్రాక్టర్‌కు రూ.6 వేల నుంచి రూ.6,500 చెల్లించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఒకటి రెండు ఇసుక పాయింట్ల ఉండడంతో రవాణా చార్జీలకు ఇబ్బంది ఉండేది కాదు.

మండలం	ఇసుక పాయింట్	టన్ను ధర (రూపాయల్లో)
చిత్తూరు	పాలూరు	155
చిత్తూరు	దిగువమాసాపల్లి	155
పలమనేరు	బైరెడ్డిపల్లి క్రాస్‌రోడ్డు	200

ప్రభుత్వ ఆదేశాల మేరకే..



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మూడు ప్రాంతాల్లో ఇసుక డిపోలను ఏర్పాటు చేశాం. ఈ నెల 8వ తేదీ నుంచి ఇసుక డిపోలు మూడు ప్రాంతాల్లో ప్రారంభమవుతాయి. ప్రజలు ఏ డిపో నుంచి అయిన ఇసుక తీసుకోవచ్చు. డిపోల్లో మొదట వచ్చిన వారికి మాత్రమే ఇసుక ఇవ్వడం జరుగుతుంది. నగదు రూపంలో చెల్లింపులు చేయకూడదని, యూపీఐ ద్వారా చెల్లింపులు చేయాలని ఆదేశించాం. వినియోగదారుడు పొందే ఇసుకకు సంబంధించి డిపోల వద్ద రశీదు ఇవ్వడం జరుగుతుంది. పకడ్బందీగా ఇసుక పంపిణీకి చర్యలు చేపడుతున్నాం.

– సుమిత్‌కుమార్ గాంధీ, కలెక్టర్, చిత్తూరు జిల్లా

రైతు బాంధవుడు వైఎస్సార్



శ్రీసిటీ సెజ్‌లో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ 8 పరిశ్రమలు ప్రారంభిస్తున్న దృశ్యం (ఫైల్)



శ్రీసిటీ ఏరియల్ వ్యూ

- ఆయన హయాంలోనే తిరుపతిలో పశువైద్య విశ్వవిద్యాలయం
- పాడి పరిశ్రమాభివృద్ధికి ఎనలేని కృషి
- పశుజాతుల పరిరక్షణే ధ్యేయంగా పరిశోధనలు
- నేడు వైఎస్సార్ 75వ జయంతి

తిరుపతి సిటీ: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాడి పరిశ్రమ అభివృద్ధికి ఎనలేని కృషి చేసి రైతు బాంధవుడుగా తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయులయ్యారు. తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వైఎస్సార్ మానసపుత్రికగా నిలిచిపోయింది. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఏర్పాటుకు 2004 సెప్టెంబర్ 30న బీజం పడింది. అప్పటి సీఎంగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి తిరుపతి వెటర్నరీ కళాశాల స్వర్ణోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరై వెటర్నరీ కళాశాలకు యూనివర్సిటీగా గుర్తింపు తెచ్చేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చి, 2005 జూలై 15న వర్సిటీగా గుర్తింపునిచ్చారు. పాడి పరిశ్రమ అభివృద్ధి, పాల ఉత్పత్తి పెంపు, జంతుసంపదను వృద్ధి, పశువైద్యంపై దృష్టి, పశుజాతుల సంరక్షణపై విస్తృత పరిశోధనలు ..ఇత్యాది లక్ష్యాలతో వర్సిటీ అభివృద్ధి చెందాలని అధికారులకు ఆయన నిర్దేశించారు. తొలుత రూ.45కోట్లు కేటాయించిన వైఎస్సార్ మరో విడతలో వర్సిటీ మౌలిక వసతుల కల్పన కోసం రూ.100 కోట్లు కేటాయించారు. కాలక్రమంలో వెటర్నరీ వర్సిటీ అంచెలంచెలుగా ఎదిగి మహా వృక్షంలా విరాజిల్లుతోంది. ప్రసుత్తం వర్సిటీ పరిధిలో తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు, గరివిడిలో వెటర్నరీ కళాశాలలు, తిరుపతిలో డెయిరీ టెక్నాలజీ కళాశాల, ముత్తుకూరులో మత్స్య కళాశాలలు ఉన్నాయి. అలాగే పాలిటెక్నిక్ కళాశాలలు 30 ఉన్నాయి. వీటిలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులతో పాటు అనిమల్ హస్బెండరీలో పాలిటెక్నిక్ కోర్సులు సైతం ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య 3వేలకు పైగా చదువుతున్నారు. అధ్యాపకులు 305 మంది, బోధనేతర సిబ్బంది 2,545 మంది ఉన్నారు. అలాగే పరిశోధన సంస్థ సైతం ఉంది. ప్రపంచంలోనే పేరొందిన పుంగనూరు, ఒంగోలు జాతి పశు సంతతి అభివృద్ధికి పెద్ద ఎత్తున పరిశోధనలు చేస్తున్నారు. పిండమార్పిడి విధానంలో ఈ జాతులను పెంపొందించేందుకు వర్సిటీ కృషి చేస్తోంది. ఇక్కడ పశువైద్య విద్యను అభ్యసించిన పేద విద్యార్థులు ఎందరో దేశ, విదేశాల్లో రాణిస్తున్నారంటే ఇదంతా వైఎస్ చలువనేని ఎస్వీ వెటర్నరీ విశ్రాంత వీసీ డాక్టర్ వి.పద్మనాభరెడ్డి కీర్తించారు.

మరువలేని 8.8.2008

2006లో అధికారికంగా శ్రీసిటీ సెజ్‌కు పచ్చజెండా ఊపి 8.8.2008లో 8 పరిశ్రమలకు అప్పట్లో సీఎంగా వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. 8 పరిశ్రమలతో మొదలైన శ్రీసిటీ పారిశ్రామికవాడ అంచెలంచెలుగా అభివృద్ధి చెంది 200 పైచిలుకు పరిశ్రమలకు కేంద్రంగా మారింది. సుమారు రూ.50వేల కోట్ల పెట్టుబడులతో 27 దేశాలకు చెందిన పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. పలు పరిశ్రమల ఉత్పత్తులు ఎగుమతులవుతున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 50వేలకు పైగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.



వర్సిటీలోని పశువైద్య కళాశాల డైమండ్ జూబ్లీ చిహ్నం

సత్యవేడుపై వైఎస్‌ఆర్ చెరగని ముద్ర



నాగలాపురం మండలంలో నిర్మించిన భూపతేశ్వరకోన ప్రాజెక్టు

వరదయ్యపాళెం: ఆంధ్ర–తమిళనాడు రెండు రాష్ట్రాల సరిహద్దులోని వెనుకబడిన ప్రాంతమైన సత్యవేడు నియోజకవర్గం 2004 నుంచి 2009 మధ్యలో అన్ని విధాలా అభివృద్ధి చెందింది. అప్పటి సత్యవేడు స్థానిక ఎమ్మెల్యే కళత్తూరు నారాయణస్వామి చొరవతో నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చేయూతనిచ్చారు. 2004లో ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన వెంటనే 'వైఎస్‌ఆర్ రాజీవ్ పల్లెబాట' పేరిట జిల్లాలోనే సత్యవేడు నియోజకవర్గంలో తొలిసారిగా పర్యటించిన ఆయన వరాల జల్లుతో ఈ ప్రాంతం అభివృద్ధికి నాంది పలికారు. సత్యవేడులో ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు ఉబ్బలమడుగు, భూపతేశ్వరకోన, రాళ్ల వాగు నీటి ప్రాజెక్టుల ఏర్పాటు చేశారు.

వ్యవసాయానికి పెద్దపీట

నాగలాపురం, సత్యవేడు మండలాలకు చెందిన 3వేల ఎకరాలకు సాగునీరు అందించే దిశగా నాగలాపురం మండలంలో రూ.5.50కోట్లతో భూపతేశ్వరకోన ప్రాజెక్టును 2008–09లో, అలాగే బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం మండలాల సాగునీటి అవసరాల కోసం రూ. 19కోట్లతో 2600 ఎకరాల సాగునీరు అందించేందుకు వరదయ్యపాళెం సమీపంలో ఉబ్బలమడుగు సాగునీటి ప్రాజెక్టును నిర్మించారు. తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి చెరువులకు నీటిని నింపి తద్వారా 18వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూ. 100కోట్లతో ఉపకాలువలు నిర్మించారు.

విద్యా సంస్థలకు ప్రాధాన్యం

సత్యవేడుకు కలగా మిగిలిన డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, 9 హైస్కూళ్లు, ఒక తమిళ మీడియం స్కూల్ ఏర్పాటు చేయడంతో ఇంటర్ తర్వాత ఉన్నత విద్యకు సుదూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులకు కష్టాలు తప్పాయి. దీంతో నియోజకవర్గంలోని విద్యార్థులు, తల్లిదండ్రులు మహానేతను విద్యాదాతగా ఇప్పటికీ స్మరిస్తున్నారు.

అయ్యప్ప సేవలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి



అయ్యప్పస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్పస్వామి ఆలయాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం సందర్శించారు. తిరుపతి కపిలతీర్థం ఆలయంలో వేకువ జామున మాలధారణ చేసిన అనంతరం ఆయన ఇక్కడికి వచ్చారు. ఆలయంలోని వినాయక, ఆంజనేయ, నాగమల్లేశ్వరస్వామి, నవగ్రహాల ఆలయాల్లో పూజలు చేశారు. అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నారాయణన్ నంబూద్రి ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, జింకా చలపతి, అమర్నాథ రెడ్డి, మనోహర్ రెడ్డి, బాబు రెడ్డి, సత్యన్న, దామోదర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్వారకనాథరెడ్డి దీక్ష

అయ్యప్ప ఆలయంలో ఉదయం తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అయ్యప్ప దీక్ష స్వీకరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అసంతృప్తా.. ధిక్కారమా..!

- చిత్తూరు పార్లమెంటు సమావేశానికి ఎమ్మెల్యేల డుమ్మా
- నేతల తీరుతో కార్యకర్తల విస్మయం
- సీఎం దృష్టికి తీసుకెళ్లే యోచనలో జిల్లా నాయకత్వం



మాట్లాడుతున్న చిత్తూరు ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు అర్బన్: జిల్లా తెలుగుదేశం పార్టీలో ప్రభుత్వం ఏర్పాటై నెల కూడా కాకముందే నిర్లక్ష్యం నెలకొందో లేక నేతల మధ్య అసంతృప్తులు మొదలయ్యాయో తెలియడం లేదు. తొలిసారి జరిగిన జిల్లాస్థాయి సమావేశానికి పలువురు టీడీపీ ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. దీనిపై ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. ఆదివారం చిత్తూరులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చిత్తూరు పార్లమెంటు స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. చిత్తూరు ఎంపీ దగుమళ్ల ప్రసాదరావు తాను ఎంపీగా గెలిచిన తర్వాత తొలిసారిగా జిల్లా కేంద్రానికి రావడంతో పాటు ఎమ్మెల్యేలతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రజాసమస్యలపై పరిష్కార మార్గాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు ప్రధాన అజెండాగా ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలోని ఎమ్మెల్యేలంతా రావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజన్ అందరినీ కోరారు. అయితే సమావేశానికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తప్ప, మరే ప్రజాప్రతినిధి కూడా హాజరు కాలేదు. దీనిపై చిత్తూరు ఎంపీ కాస్త అసంతృప్తికి లోనైనట్లు తెలుస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చాక తొలిసారిగా నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశానికి ఎమ్మెల్యేలు రాకపోవడంతో ఆయన కలత చెందినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఎంపీకి చేదు అనుభవం..

ప్రధానంగా జిల్లాలో మామిడి రైతులకు అండగా నిలవడానికి జిల్లాలో మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయడంపై ఎమ్మెల్యేల అభిప్రాయం తీసుకుందామనుకున్న ఎంపీ దగుమళ్ల ప్రసాద్‌కు చేదు అనుభవం ఎదురైంది. జిల్లాకేంద్రంలో కేంద్రీయ విశ్వవిద్యాలయ స్థాపనకు తనవంతు కృషి చేస్తామని హామీ ఇవ్వాలనుకున్నా, దాన్ని పట్టించుకోవడానికి ఎవరూ కూడా ముందుకు రావట్లేదని తెలుస్తోంది. పూతలపట్టు ఎమ్మెల్యే తప్ప మరి ఎమ్మెల్యే ఈ సమావేశానికి రాకపోవడంతో పార్టీ పరిస్థితిని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌తో పాటు ఎంపీ సైతం నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం. తొలి సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడం ప్రజల్లోకి వేరేలా సంకేతాలు వెళ్తాయని వీరిద్దరూ చర్చించినట్లు తెలిసింది. ఆదిలోనే హంసపాదు అన్నట్టు జిల్లా తెలుగుదేశం పార్టీలో చోటు చేసుకున్న ఈ పరిణామం ముమ్ముందు ఎలాంటి అసంతృప్తులకు దారి తీస్తుందో వేచి చూడాలి.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

తిరుమల: తిరుమల జీఎన్సీ టోల్ గేట్‌కు సమీపంలోని అటవీ ప్రాంతంలో నెల్లూరు జిల్లాకు చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. తిరుమల టూటౌన్ పోలీస్ స్టేషన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. టోల్ గేట్ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఓ చెట్టుకు గుర్తుతెలియని 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసున్నాడు. స్థానికులు గుర్తించి తిరుమల పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుని ఆచూకీ కోసం ప్రయత్నించగా అతని షర్ట్ వెనుక కాలర్‌పై సుధాటైలర్, అదురుపల్లి, నెల్లూరు అని రాసి ఉండడాన్ని గుర్తించారు. దీంతో సదరు టైలర్‌తో పోలీసులు మాట్లాడి మృతుడి వివరాలు తెలుసుకున్నారు. మృతుడు నెల్లూరు జిల్లా, చేజర్ల మండలం, పద్మావతి కండ్రిగ గ్రామానికి చెందిన మల్లెల భార్గవ్‌గా గుర్తించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. అనంతరం దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

కార్మికుడికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని వికృతమాల డిక్షన్ కర్మాగారం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని వికృతమాల డిక్షన్ కర్మాగారంలో మహారాష్ట్రకు చెందిన సందీప్(28) కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం పని ముగించుకుని ఇంటికి కాలినడకన వెళుతుండగా రేణిగుంటకు వెళుతున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనం వెనుక నుంచి అతడిని ఢీకొంది. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం రేణిగుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పల్లెలకు చేతబడి!

రాకెట్ వేగంతో దూసుకుపోతున్న నేటి హైటెక్ కాలంలో కూడా పల్లెల్లో మూఢనమ్మకాలు ఇంకా రాజ్యమేలుతున్నాయి. మంత్రాలు, తంత్రాలు, గుప్తనిధుల పేరిట కొందరు గ్రామీణులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. క్షుద్రపూజలు, చేతబడులు అంటూ లక్షలు ఖర్చు చేసుకుని చేతులు కాల్చుకుంటున్నారు. ఇలాంటి కోవలోకి వచ్చే ఘటనలు జిల్లాలో తరచూ జరుగుతూ కలకలం సృష్టిస్తున్నాయి.

- నేటి స్మార్ట్ కాలంలోనూ పల్లెలను పట్టి పీడిస్తున్న మూఢనమ్మకాలు
- అనారోగ్యం చేస్తే కూడా మంత్రగాళ్ల దగ్గరకు పరుగులు పెడుతున్న జనం
- ఒళ్లు గగుర్పొడిచేలా క్షుద్రపూజలు
- సరిహద్దు ప్రాంతాల్లోనే ఇలాంటివి ఎక్కువ
- రూ.లక్షల్లో ఖర్చు చేసుకుంటున్న అమాయక జనం
- భయాందోళనలో గ్రామీణ ప్రజలు

- పెనుమూరు మండలం కవలగుంట డ్యామ్ వద్ద మూడేళ్లకు క్రితం ఓ అమావాస్య రాత్రి క్షుద్రపూజలు జరిగాయి. రాత్రంతా పూజలు చేసి పసికందును బలి ఇచ్చారు. మరుసటి రోజు సాయంత్రం డ్యామ్‌లో పసికందు శవం నీటిపై తేలింది. ఈవిషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు ఆరా తీశారు.
- చిత్తూరు మండల కేంద్రంలోని ఓ అటవీ ప్రాంతంలో ఇటీవల రాత్రంతా క్షుద్రపూజలు చేయడంతో కలకలం రేగింది. ఆ ప్రాంతంలో నిమ్మకాయలు, కుంకుమ, విబూధి, నల్లటి దుస్తులు, మట్టితో తయారు చేసిన బొమ్మలను పెట్టి పూజలు చేశారు. వాటి పక్కనే ఒక మట్టి బొమ్మను, కొన్ని దుస్తులను కాల్చేశారు. వీటితో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అప్పటి నుంచి ప్రజలు అటువైపు వెళ్లడం మానేశారు.



క్షుద్రపూజలు చేసిన దృశ్యం (ఫైల్)

అన్నిటికీ మంత్రం..తంత్రం..

క్షుద్రపూజలు, చేతబడులకు సంబంధించిన కొన్ని సంఘటనలను వింటేనే ఒళ్లు గగుర్పొడుస్తాయి. ఇంకొన్ని నేరుగా చూస్తే వణుకు పుట్టేలా చేస్తాయి. మనిషిని చంపేయాలని, రోడ్డు ప్రమాదంలో చనిపోవాలని, అనారోగ్యంతో మరణించేలా, కుటుంబం రోడ్డున పడేలా, గొడవలు, దంపతుల మధ్య కలహాలు, ఇళ్లు, ఊరు వదిలి పారిపోయేలా క్షుద్రపూజలు, చేతబడులు చేయించేవాళ్లు ఉండడం విస్తుపోయే అంశం. నేల తగాదాలు, మహిళలను వశపరుచుకోవడానికి అంటూ మంత్రాలు, క్షుద్రపూజలను చేయిస్తున్నారు. మంత్రగాళ్లుగా చెలామణి అవుతున్న కొందరు వ్యక్తులు దుష్టశక్తులను ఆవహించేలా పసికందులను బలి తీసుకుంటున్నారు. ఇందుకోసం అమావాస్య, నిండు పౌర్ణమిని మంచి ఎంచుకుంటారు. అడవులు, చెరువులు, ఖాళీ ప్రదేశాలు, శ్మశాన వాటికలను కేంద్రంగా చేసుకుని చీకటి వేళ భారీ పూజలు చేస్తుంటారు.

కాణిపాకం: ప్రస్తుతం అంతా స్మార్ట్ ప్రపంచం. నాగరికత ఎంతో అభివృద్ధి చెందింది. అయితే గ్రామీణ ప్రాంత ప్రజలు మాత్రం ఈ స్మార్ట్ ప్రపంచంలో కూడా మూఢ నమ్మకాలను నమ్ముతున్నారు. అవి వారి పాలిట శాపంగా మారాయి. జిల్లా తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో ఈ క్షుద్రపూజలు, చేతబడులు లాంటి వాటికి ప్రాధాన్యత సంతరించకుంది. ముఖ్యంగా వి.కోట, పలమనేరు, రామకుప్పం, శాంతిపురం, కుప్పం, గుడిపాల, పెనుమూరు, చిత్తూరు, జీడీనెల్లూరు, పాలసముద్రం, ఎస్‌ఆర్‌పురం, నగరి, కార్వేటినగరం తదితర మండలాల పరిధిలో చేతబడులు, క్షుద్రపూజలు, మంత్రాలు వంటివి విచ్చలవిడిగా జరుగుతున్నాయి. శ్మశాన వాటిక, అటవీ ప్రాంతం, చెరువు కట్టల వద్ద క్షుద్రపూజలు చేస్తుండడంతో ప్రజలను భయపడుతున్నారు.

ఫారెస్ట్ ఏరియాల్లోనే ఎక్కువ..

మంత్రాల కోసం మూడు కూడళ్లు, పలు రహదారుల్లో నిమ్మకాయలు, గుడ్లు, కుంకుమ, మట్టి బొమ్మలు, విబూధి వంటివి జనాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పలువురి ఇంట మంత్రాలంటూ నిమ్మకాయలు, పటాలు వేలాడుతుంటాయి. వీటిని చూసి మరింతమంది కూడా మంచిచెడులకు అటు వైపు పరుగులు పెడుతున్నారు. ప్రజల అమాయకత్వాన్ని కొందరు మంత్రగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుని రెచ్చిపోతున్నారు.

మంత్రతంత్రాలను నమ్ముతూ..

గ్రామీణ ప్రాంత ప్రజలు శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మూఢ నమ్మకాలనే నమ్ముతున్నారు. ఆస్పత్రులకు వెళ్లకుండా మంత్రగాళ్లను ఆశ్రయిస్తున్నారు. ఇక ఈ పూజల కోసం తమిళనాడులోని పరదారామి, గుడియాత్తం, షోలింగరం, పొన్నై, అంబూరు, వేలూరు, తిరుత్తణి, తిరువణ్ణామలై, మలైనూరు, నాగూర్‌తో పాటు కేరళ రాష్ట్రాలకు సైతం వెళ్తున్నారు. ఇక చిన్న చిన్న మంత్రాలు చేసే వ్యక్తులు అయితే జిల్లాలోనే పదుల సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. ఇందు కోసం మంత్రగాళ్లు పూజను బట్టి రూ.5 వేల నుంచి రూ.లక్షల మేర వసూలు చేస్తుంటారని తెలుస్తోంది. ఇక పూజాసామగ్రి, వగైరా పేరిట మరింత గుంజుతున్నారు. మంచికి, చెడుకు పల్లె ప్రజలు మంత్రాలను ఆశ్రయిస్తూ..లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటున్నారు. అప్పు చేసి మరీ మంత్రాలు చేయించుకోవడం విస్తుగొలిపే అంశం.

నిధుల అన్వేషణలో..

గ్రామీణ ప్రాంతాల్లో కొందరు గుప్త నిధుల అన్వేషణలో ఉంటారు. వీరు పురాతన ఆలయాలు ఉన్నచోట్ల చీకటి వేళ తవ్వకాలు జరుపుతారు. గుడిపాల మండలంలోని పాలేగాళ్లు నివాసించిన కొండల్లో క్షుద్రపూజలు చేసి గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. దీంతో కట్టడాలన్నీ కూలిపోయాయి. అలాగే చిత్తూరు మండలం, ఎస్‌ఆర్ పురం మండలం, జీడీనెల్లూరు మండలాల్లో కూడా పలు ప్రాంతాల్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు జోరందుకున్నాయి. దీంతో పల్లె ప్రజలు భయం గుప్పెట్లో బతుకుతున్నారు.

అనుభవించక తప్పదు..



పల్లెల్లో ఈ చేతబడులు, క్షుద్రపూజలు ఎక్కువయ్యాయి. గతంలో ఇలాంటి వాటికి ప్రజలు కాస్త దూరంగా ఉన్నారు. మళ్లీ ఇలాంటివి పెరిగాయి. తంత్రాలతో ఎదుటి వ్యక్తులను ఇబ్బంది పెట్టాలని చూస్తుంటారు. ఆ పాపం ఊరికే వదిలిపెట్టదు. కచ్చితంగా ఆ పాపాలను అనుభవించాలి. భగవంతుడు క్షమించడు.

– సుధాకర్ గురుక్కల్, అర్చకులు

వాటి జోలికి వెళ్లొద్దు



ఏదైనా కారణం చేత ఒళ్లు కాస్తు నీరసంగా అనిపించి కాళ్లు, చేతులు లాగితే అది చేతబడిగానే నమ్ముతున్నారు. ఆ వెంటనే మంత్రాలు..తంత్రాలు అంటూ మాయగాళ్ల ఉచ్చులో పడుతున్నారు. చివరకు రోగం ముదిరిన తర్వాత డాక్టర్ల వద్దకు వెళ్లేసరికి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఏ జబ్బు వచ్చిన ఆస్పత్రికి వెళ్లడం మంచిది. మంత్రాలు, తంత్రాల జోలికి వెళ్లొదు.

– డాక్టర్ రవిరాజు, వైద్య నిపుణులు

కేసులు పెడుతాం



క్షుద్రపూజలు, చేతబడులు, గుప్త నిధుల తవ్వకాలన్నీ కూడా గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా జరుగుతుంటాయి. ఎక్కడైనా ఇలాంటివి జరిగినట్టు ఆధారాలు ఉంటే కేసులు పెడుతాం. వీటికి ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. సమాచారం ఇస్తే వారిపై కేసులు పెడతాం. వివరాలను గోప్యంగా ఉంచుతాం. తంత్రగాళ్ల మాయమాటలకు మోసపోవద్దు. రోగం వస్తే వైద్యుల దగ్గరకు వెళ్లాలి.

– రామ్మోహన్, ఎస్ఐ, కాణిపాకం

కలహాలు తెచ్చి పెడతాయి



మంత్రాలు..తంత్రాలు అనేవి ఒక మూఢ నమ్మకాలు. వీటి జోలికెళ్లి చాలామంది చేతులు కాల్చుకుంటున్నారు. కుటుంబాల్లో కూడా ఇవీ కలహాలు తెచ్చి పెడతాయి. ఒకరకంగా చెప్పాలంటే మనిషికి ఇది ఒక రకమైన జబ్బు. ప్రజల్లో మార్పు రావాలి.ఆలోచన శైలి మారాలి. చెడు మార్గాల్లోకి వెళ్లిపోకూడదు. సమాజంలో జాగ్రత్తగా బతకడం నేర్చుకోవాలి. ఏరోగం వచ్చిన వైద్యం ఉత్తమమనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి.

– జయప్రియ, మానసిక వైద్యనిపుణులు, చిత్తూరు

గంగమ్మ దీవెనల కోసం..



ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ అమ్మవారు



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

- బోయకొండకు భారీగా తరలివచ్చిన భక్తజనం
- ఆషాఢమాసం కావడంతో పెరిగిన రద్దీ
- భారీగా స్తంభించిన ట్రాఫిక్
- ఇబ్బంది పడిన భక్తులు

చౌడేపల్లె: గంగమ్మ తల్లి దీవెనల కోసం భక్తులు బోయకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం పైగా ఆషాఢమాసం కావడంతో గంగమ్మ ఆలయంలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. ఆదివారం ఆలయంలోని క్యూలన్నీ కిక్కిరిశాయి. ఎటుచూసినా బోయకొండ జనసంద్రంగా మారింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సుమారు 25 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి జంతుబలులు ఇచ్చారు.

ఆదివారం నాడు భారీ ఆదాయం..

ఆదివారం నాడు మాత్రమే అమ్మవారి ఆలయానికి రూ.13,28,662 ఆదాయం వచ్చినట్లు ఈఓ చంద్రమౌళి తెలిపారు. దర్శన టికెట్లు, అమ్మవారి ప్రసాదాల విక్రయాల ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు చెప్పారు. అన్నదానానికి రూ.9500 వచ్చినట్లు తెలిపారు.

స్తంభించిన ట్రాఫిక్..

బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద అడుగడుగునా భక్తులు ఇబ్బంది పడ్డారు. ఆషాఢ మాసంలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుందన్న సంగతి అధికారులకు తెలుసు. అయినా సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. కిలోమీటర్ల మేర వాహనాలు స్తంభించాయి. ఒకరిద్దరు మాత్రమే పోలీసులు ఉండడంతో ట్రాఫిక్ నియంత్రణ కూడా కష్టతరమైంది. గంటల తరబడి మహిళలు, చంటిపిల్లల తల్లులు, వృద్ధులు తాగునీటి కోసం ఇబ్బంది పడ్డారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని దుకాణదారులు శీతల పానీయాలను అధిక ధరలకు విక్రయించారు. చివరికి లడ్డూప్రసాదం టికెట్ల కొనుగోలు, ప్రసాదాల కౌంటర్ల వద్ద కూడా భక్తులు నానాతంటాలు పడ్డారు.

త్రిశూలం వద్దనే పూలు, కడ్డీలు..

అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు చేదు అనుభవం ఎదురైంది. అమ్మవారికి పూజ చేసేందుకు కొనుగోలు చేసిన టెంకాయను సమర్పించినప్పటికీ అగర బత్తీలు, పూలను గాలిగోపురం ముందుభాగంలో గల త్రిశూలం వద్ద పడేశారు. వాటిని ఆలయ సిబ్బంది భక్తుల మనోభావాలను దెబ్బ తీసేవిధంగా పరకలతో తోసి చెత్తకుప్పలో పడేశారు. దీంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.





అమ్మవారి ఆలయం త్రిశూలం వద్ద పారకతో తోస్తున్న ఆలయ సిబ్బంది, ప్రసాదాల కౌంటర్ వద్ద భక్తుల అగచాట్లు

ర్యాంపుల వైపే రైతుల చూపు

- మామిడిని కొనని గుజ్జు పరిశ్రమలు
- స్పాట్‌లో టన్ను రూ.22 వేలకు కొనుగోలు
- మరో రెండువారాల్లో ముగియనున్న తోతాపురి సీజన్

పలమనేరు: పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లోని మామిడి రైతులకు గుజ్జు పరిశ్రమల నిర్వాహకుల రింగ్ కారణంగా ఆశించిన ధరలు లభించలేదు. జిల్లా కలెక్టర్‌తోపాటు హార్టికల్చర్ ఉన్నతాధికారులు ఆదేశించినా ఇక్కడి గుజ్జు పరిశ్రమలు వారి ఆదేశాలను బేఖాతరు చేశాయి. కొన్ని పల్ప్ ఫ్యాక్టరీలైతే తమకే మామిడికాయలే వద్దంటూ కొనడం లేదు. ఇలాంటి తరుణంలో పలమనేరు, బంగారుపాళెం ప్రాంతాల్లోని ప్రైవేటు మామిడి వ్యాపారుల ర్యాంపులే తోతాపురి రైతుకు అండగా మారాయి.

రింగ్‌గా ఏర్పడి ధర తగ్గించిన వైనం..

చిత్తూరు జిల్లాలో 30 దాకా మామిడి గుజ్జు పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ ఏటా మే నుంచి జూలై దాకా తోతాపురి సీజన్ నడుస్తుంది. ఈ నేపథ్యంలో ఏటా రైతుల నుంచి సరుకు ఎక్కువగా వస్తున్నప్పుడు ఫ్యాక్టరీలు రింగుగా ఏర్పడి మామిడి ధరను తగ్గించడం గత కొన్నేళ్లుగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ దఫా సైతం ప్రభుత్వం తోతాపురి టన్ను ధర రూ.30 వేలుగా ఉండాలని నిర్ణయించారు. కానీ అధికారుల మాటను గుజ్జు పరిశ్రమలు అసలు పట్టించుకోలేదు. కనీసం టన్ను రూ.22 వేలకు సైతం తమకు వద్దంటూ సరుకును తిప్పి పంపుతున్నారు. ఇలా ఉండగా దీన్ని గమనించిన కొందరు వ్యాపారులు పలమనేరు, బంగారుపాళెంలో పది దాకా ర్యాంపులను ఏర్పాటు చేసి అక్కడికక్కడే రైతులు తెచ్చిన మామిడిని టన్ను రూ.22 వేల నుంచి రూ.23 వేల దాకా కొంటున్నారు. దీంతో ఇక్కడి రైతులు సైతం ఎలాగూ రవాణా చార్జీలు కలిసి వస్తాయని స్థానికంగా ఉన్న ర్యాంపుల్లోనే అమ్మకాలు చేస్తున్నారు.

ముగియనున్న తోతాపురి సీజన్..

ఇలా ఉండగా ఇప్పటికే తోటల్లోని తోతాపురి 80 శాతం ఖాళీ అయింది. మిగిలిన కాయలను ఈనెల 20లోపు అమ్మకాలకు వెళ్లాల్సిందే. సరుకు తగ్గుతున్న సమయంలోనూ గుజ్జు పరిశ్రమలను ధరను పెంచడం లేదు. ర్యాంపుల్లో రైతులు విక్రయించిన సరుకును మాత్రం ఇదే ఫ్యాక్టరీలు ఎలా కొంటున్నాయో ఇక్కడి మామిడి రైతులకు అర్థంకాలేదు. వ్యాపారులకు అయితే ఓ రూలు, రైతులంటే మరో రూలా అనే మాట వినిపిస్తోంది. ఏదేమైనా తోటల్లో మాగి రాలిపోతున్న కాయలను స్థానిక ర్యాంపుల్లోనే అమ్మి వచ్చిన కాడికి తీసుకుపోతున్నారు ఇక్కడి మామిడి రైతులు. వచ్చే ఏడాదైనా మామిడికి ప్రభుత్వం మద్దతు ధరను అమలు చేసి ప్రైవేటు పల్ప్ ఫ్యాక్టరీల్లో దీన్ని అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హంస వాహనంపై పరాశరేశ్వరస్వామి చిద్విలాసం

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి స్వామి వారు హంస వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పరివార దేవతలకు అభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వర స్వామికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారు హంస వాహనాన్ని అధిరోహించారు.

ఎగసి పడుతున్న అలలు

వాకాడు: అల్పపీడనం ప్రభావంతో ఆదివారం రాత్రి మండలవ్యాప్తంగా పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి పెనుగాలులతో మొదలై గంటకుపైగా వర్షం కురిసింది. అలాగే తూపిలిపాళెం సముద్ర తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. మత్స్యకారులు వేట సామగ్రిని ఒడ్డుకు చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు. తూర్పు బంగాళాఖాతంలో



ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా మారుతున్న నేపథ్యంలో మరో 3 రోజు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ సమాచారం.

ఇసుక డంప్‌పై అక్రమార్కుల కన్ను

- రూ.కోటి విలువజేసే ఇసుకను తరలించేందుకు ప్లాన్
- గంగవరం నాలుగురోడ్ల కూడలిలో ఇసుకను డంప్ చేసిన జేకే కంపెనీ
- ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అవసరమైన వారికి ఇసుకను అందించాలంటున్న స్థానికులు

పలమనేరు/గంగవరం: గత ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఇసుక అమ్మకాలకు జేకే కంపెనీ అనుమతులను పొందింది. ఆ మేరకు అవసరమైన వారికి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఇసుక సరఫరా చేసేవారు. ఇందులో భాగంగా ఆ కంపెనీ నిర్వాహకులు గంగవరం మండలంలోని నాలుగురోడ్లు వద్ద చెన్నై-బెంగళూరు హైవేకి ఆనుకుని కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల్లో భారీగా ఇసుకను డంప్ చేశారు. అయితే ఎన్నికల కారణంగా కోడ్ అమల్లోకి రావడంతో ఆ కంపెనీ వాళ్లు సైతం ఇసుకను ఎవరికీ సరఫరా చేయలేదు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ఇసుకను ప్రజలకు ఉచితంగానే అందిస్తామంటూ ఆదేశాలను జారీ చేసింది. అయితే ఈ వేల లోడ్ల ఇసుక రూ.కోటి విలువజేస్తుంది. దీన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజలకు అందిస్తే బాగుంటుందని స్థానిక గ్రామస్తులు ఆశిస్తున్నారు. కానీ దీనిపై కొందరి ఇసుకాసురుల కన్ను పడిందని తెలుస్తోంది. ఎలాగైనా రాష్ట్ర సరిహద్దులు దాటించేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఏపీ మైనింగ్, సెబ్ అధికారులు ఈ భారీ డంప్‌ను స్వాధీనం చేసుకుని అవసరమైన వారికి అందిస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.



గంగవరం నాలుగు రోడ్ల వద్ద నిల్వ ఉన్న భారీ ఇసుక డంప్

నాలుగురోడ్ల డంప్ నుంచి ఇసుక సరఫరా

రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం నేటి నుంచి నూతన ఇసుక విధానాన్ని అమలు చేస్తోందని ఇది పారదర్శకంగా ఉంటుందని పలమనేరు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గంగవరం మండలంలోని నాలుగురోడ్లు వద్ద నిల్వ ఉన్న ఇసుక డంప్ నుంచి ఓ టన్నుకు రూ.200గా ఇసుకను అవసరమైన వారికి విక్రయిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆర్థిక లావాదేవీలు యూపీఐ ద్వారానే జరగాలని తెలిపారు. ఓ రోజుకు డంప్ నుంచి 300 టన్నుల ఇసుకను మాత్రమే అందిస్తామని తెలిపారు. ఫస్ట్ ఈజ్ ఫస్ట్ లెక్కన ఇసుక సరఫరా ఉంటుందన్నారు. స్థానికులకు తప్పా ఇతర రాష్ట్రాల వారికి ఎలాంటి ఇసుక సరఫరా ఉండదని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి ఏదైనా అనుమానాలు ఉంటే స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మాతృ భాష పరిరక్షణకు కృషి



కవులు, విద్యార్థులతో సమితి నిర్వాహకులు

పలమనేరు : మాతృ భాష.. సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాల్సిన బాధ్యత నేటి సమాజంపై ఉందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ సమీపంలోని కళామందిరంలో సంస్థ ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళామందిరాన్ని స్థాపించిన రెండేళ్లలో 153 భాషా సాహిత్య కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. రెండు లక్షల నీతి పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశామని చెప్పారు. ఏపీకి చెందిన రచయితలే కాకుండా తమిళనాడు, కర్ణాటకకు చెందిన వారిని సైతం ఇక్కడికి పిలిపించి సన్మానం చేసినట్లు వెల్లడించారు. అనంతరం తెలుగు భాషపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన 20 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ క్రమంలోనే తెలుగు భాష ఉన్నతికి కృషి చేస్తున్న 20 మంది కవులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు పుష్ప, మాధవరెడ్డి, సీతారామయ్య, బాబు, నవీన్, విజయ్, మురళి, మొహిదీన్, అబిదాలీ తదితరులు పాల్గొన్నారు.